

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకట్రావ్

# ఎన్నికల విధులను పకడ్బందీగా నిర్వహించాలి

- కలెక్టర్ ఎస్.వెంకట్రావ్

సూర్యాపేట, అక్టోబర్ 25 : ఎన్నికల నియమావళి పాటిస్తూ, విధులను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు ఎ.వెంకట్‌రెడ్డి, సీహెచ్.ప్రియాంకతో కలిసి నోడల్ అధికారులు, ఎన్నికల సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు ఎంసీసీ, ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ, వీఎస్‌టీ టీమ్‌లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమావళి ఉల్లంఘనలు జరుగకుండా పరిశీలించాలన్నారు. ఈవీఎంల ఫస్ట్ ర్యాండమైజేషన్ పూర్తయిందని సెకండ్, థర్డ్ ర్యాండమైజేషన్ త్వరలో పూర్తి చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలోని నాలుగు నియోజక వర్గాల్లో పీడబ్ల్యూడీ ఓటర్స్ 80 ఏండ్లు నిండిన వయో వృద్ధులకు బీఎల్‌ఓలు 12డి దరఖాస్తులు ప్రతి ఇంటికి తిరుగుతూ ఓటర్ లిస్ట్ ప్రకారం వారిని గుర్తించి పోస్టల్ బ్యాలెట్ గురించి వివరించి అవసరమైనచో నమోదు చేసి 12డి వారికి అందజేయాలన్నారు. వృద్ధులు ఓటు హక్కు వినియోగం కోసం పోలింగ్ బూత్‌కు వస్తే ప్రభుత్వం వారికి రవాణా సదుపాయం కల్పించిందని, ఈ విషయాన్ని బీఎల్‌ఓలు పీడబ్ల్యూడీ ఓటర్స్, 80 ఏండ్లు నిండిన వృద్ధులకు తెలుపాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ సదుపాయం కోరుతూ ఫారం 12డి దరఖాస్తులను స్థానిక ఎన్నికల అధికారికి నవంబర్ 8 లోపు సమర్పించాలన్నారు. జిల్లాలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులో నిరంతర తనిఖీలు చేపట్టాలని, విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకోబడుతాయని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఓ జి.వెంకటేశ్వర్లు, జిల్లా నోడల్ అధికారులు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

### సోషల్ మీడియా, బ్యాంక్ లావాదేవీలపై ప్రత్యేక దృష్టి..

ఎన్నికల నేపథ్యంలో కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్, మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ సెల్, బ్యాంక్ లావాదేవీల మానిటరింగ్ సెల్‌లను ఎస్పీ రాహుల్ హెగ్డే, అదనపు ఎస్పీ నాగేశ్వర్‌రావు, అదనపు కలెక్టర్ వెంకటరెడ్డితో కలసి కలెక్టర్ వెంకట్రావ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సోషల్ మీడియా, పెయిడ్ న్యూస్, ప్రకటనలు, బ్యాంక్ లావాదేవీలపై ఈ మానిటరింగ్ సెల్‌ల ద్వారా ప్రత్యేక నిఘా పెట్టినట్లు తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అతిక్రమించిన పోస్టులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏపీఆర్ఓ ఎ.రమేశ్‌కుమార్, ఎల్‌డీఎం బాపూజీ, ఈఐఈ మల్లేశం, ఎంసీఎంసీ కమిటీ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

### చెక్ పోస్టుల్లో నిఘా పెంచాలి..

సరిహద్దు చెక్ పోస్టుల్లో నిఘా పెంచాలని కలెక్టర్ వెంకట్రావ్ అధికారులను ఆదేశించారు. ఎస్పీ రాహుల్ హెగ్డేతో కలిసి కలెక్టరేట్‌లోని ఎన్ఐసీ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా ఇంటెలిజెన్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మంగళ, బుధవారం రూ.9 లక్షలు స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు చెప్పారు. కోడ్ అమలు నుంచి ఇప్పటి వరకు రూ.57.20 లక్షల లిక్కర్‌ను సీజ్ చేయడం జరిగిందన్నారు. జిల్లా వ్యాప్తంగా అక్రమంగా బెల్ట్ షాపులు నడుపుతున్న 181 మందిపై కేసులు పెట్టినట్లు వివరించారు. ఈ సందర్భంగా వెబ్ ఎక్స్ ద్వారా జిల్లాలో తనిఖీల్లో పాల్గొన్న టీమ్‌లతో మాట్లాడి దిశ నిర్దేశం చేశారు.


సూర్యాపేటలో కేంద్ర బలగాలు, పోలీస్ సిబ్బందితో కవాతు నిర్వహిస్తున్న ఎస్పీ రాహుల్ హెగ్డే

# ఎన్నికల సజావుకు ప్రజలు సహకరించాలి

- ఎస్పీ రాహుల్ హెగ్డే
- జిల్లా కేంద్రంలో కేంద్ర బలగాలతో కలిసి పోలీస్ కవాతు

సూర్యాపేటసిటీ, అక్టోబర్ 25 : నవంబర్ 30న జరిగే శాసనసభ ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు ప్రజలంతా సహకరించాలని ఎస్పీ రాహుల్ హెగ్డే కోరారు. ముందస్తు చర్యల్లో భాగంగా బుధవారం జిల్లా కేంద్రంలో కర్నల్ సంతోశ్‌బాబు చౌరస్తా నుంచి పీఎస్ఆర్ సెంటర్, శంకర్ విలాస్ సెంటర్, గాంధీ చౌరస్తా మీదుగా నూతన బస్టాండ్ వరకు జిల్లా పోలీసు, కేంద్ర సాయుధ బలగాలతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ఎన్నికల నియమావళి పట్ల ప్రజలకు అవగాహన కల్పించడం కోసం జిల్లా వ్యాప్తంగా పోలీస్ ఫ్లాగ్ మార్చ్ ఏరియా డామినేషన్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఓటర్లను ప్రలోభపెట్టే వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కేంద్ర బలగాల అధికారులు ప్రభాకర్‌సింగ్, గణేశ్, జిల్లా అదనపు ఎస్పీ నాగేశ్వర్‌రావు, సూర్యాపేట డీఎస్పీ నాగభూషణం, డీసీఆర్‌బీ డీఎస్పీ రవి, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ రాజేశ్, మహేశ్, సీఐలు రాజశేఖర్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, సర్కిల్ ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

# గడప గడపకూ మ్యానిఫెస్టో..

గెలిచేది మనమే...
మిగిలినవి చేసేదీ మనమే


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డి, వేదికపై ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నపూర్ణ

- మ్యానిఫెస్టోనే బీఆర్ఎస్‌కు బ్రహ్మాస్త్రం
- కాంగ్రెస్ హామీలు నీటి మూటలు...
- మ్యానిఫెస్టో అమలు మన ప్రయారిటీ..
- డబ్బులు దండుకోవడం కాంగ్రెస్ ప్రయారిటీ
- మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి
- నియోజకవర్గ స్థాయిలో ముఖ్య నేతలతో సమావేశం

సూర్యాపేట, అక్టోబర్ 25 (నమస్తే తెలంగాణ) : తెలంగాణలో జరుగబోయే ఎన్నికల్లో గెలిచేది మనమే.. ఇంకా అక్కడక్కడా మిగిలిన పనులు పూర్తి చేసేది కూడా మనమేనని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. గత తొమ్మిదిన్నరేండ్ల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలతో జనం బీఆర్ఎస్ పార్టీనే నమ్ముతున్నారన్నారు. తెలంగాణకు బీఆర్ఎస్ కరెక్ట్ పార్టీ అని, తెలంగాణ అంటేనే కేసీఆర్ అని ప్రజలు నమ్ముతున్నారన్నారు. బుధవారం సూర్యాపేట నియోకవర్గ స్థాయిలో ప్రజా ప్రతినిధులు, పార్టీ శ్రేణులతో జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. మ్యానిఫెస్టో అమలు చేయడం బీఆర్ఎస్ ప్రయారిటీ కాగా కాంగ్రెస్ ప్రయారిటీ వేరే ఉన్నదన్నారు. డబ్బులు ఎక్కడ వస్తాయి. ఎలా దండుకోవాలి అనేదే వారి తపన అన్నారు. ఇప్పటి వరకు మన ప్రభుత్వం చేపట్టిన పనులతో పాటు ముఖ్యమంత్రి కేసీఆర్ విడుదల చేసిన మ్యానిఫెస్టోను ఇంటింటికీ తీసుకువెళ్లాలని సూచించారు. సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ ప్రభుత్వంపై విశ్వాసంతో 2018లో ప్రజలు రెండోసారి అధికారం కట్టబెట్టారని, తదనుగుణంగా గత ఐదేళ్ల కాలంలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసినట్లు చెప్పారు. నేడు సూర్యాపేట నియోజక వర్గం అభివృద్ధిలో రాష్ట్రంలోని టాప్ మూడు నియోజక వర్గాలతో పోటీ పడుతున్నదన్నారు. అందరూ ఆశించిన బంగారు తెలంగాణ సాకారం కావాలంటే ముచ్చటగా మూడోసారి కేసీఆర్‌ను ముఖ్యమంత్రిని చేయడం ఒక్కటే మార్గం అన్నారు.

### కాంగ్రెస్ హామీలు నీటి మూటలే..

కాంగ్రెస్ పార్టీ హామీలు నీటి మూటలు తప్ప మరోటి కాదని మంత్రి ఎద్దేవ చేశారు. ఇప్పటికే కర్ణాటకలో ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడంతో అక్కడ రోజురోజుకు ప్రజా ఆందోళనలు పెరుగుతున్నాయన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ మ్యానిఫెస్టోలో పెట్టిన అంశాలను వందకు వంద శాతం పూర్తి చేయడంతో పాటు ప్రజలు అడగనివి, ఎవరూ డిమాండ్ చేయని వాటిని అనేకం చేసిన ఘనత సీఎం కేసీఆర్‌దే అన్నారు. ఇప్పటి వరకు ఎంతో చేసినం. చేయడానికి ఎక్కడ ఏం మిగిలింది? ఏం చేయాలి? అనేది మనకు మాత్రమే తెలుసని మళ్లీ మనమే గెలిచి అక్కడక్కడ మిగిలి ఉన్న పనులను పూర్తి చేసుకుందామన్నారు.

### మ్యానిఫెస్టోను ఇంటింటికీ తీసుకెళ్లాలి..

సీఎం కేసీఆర్ ప్రకటించిన మ్యానిఫెస్టో బీఆర్ఎస్ పార్టీకి భగవద్గీత లాంటిదన్నారు. అందుకే మ్యానిఫెస్టోకు అంతటి గౌరవం ఇచ్చి అందులో ఉన్న ప్రతి అంశాన్ని అమలు చేస్తూ వస్తున్నట్లు చెప్పారు. ప్రజలు కూడా మనం ఇచ్చే హామీలనే నమ్మతారు తప్పా గతంలో దశాబ్దాల తరబడి అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఏమీ చేయనందున ఆ పార్టీని నమ్మరన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి పాలించిన పార్టీలు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో 30 శాతం కూడా అమలు చేసిన దాఖలాలు లేక పోగా పదేళ్లలో రెండుసార్లు మ్యానిఫెస్టో ప్రకటించిన బీఆర్ఎస్ మాత్రం వంద శాతం పూర్తి చేయడమే కాక, అదనంగా అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టినట్లు గుర్తు చేశారు. ఈసారి ప్రకటించిన మ్యానిఫెస్టోను ప్రతి ఇంటికి వెళ్లేలా నియోజకవర్గంలోని ప్రతి నాయకుడు, కార్యకర్త పని చేస్తూ గతంలో చేసిన పనులు, మళ్లీ గెలిస్తే చేయబోయే పనులను వివరించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, ఉన్నత విద్యా మండలి మాజీ సభ్యుడు ఒంటెద్దు నర్సింహారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై.వెంకటేశ్వర్లు, నియోజకవర్గ పరిధిలోని బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్‌తోనే సంక్షేమాభివృద్ధి

**రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి**

**కాంగ్రెస్, బీజేపీల నుంచి బీఆర్ఎస్‌లోకి భారీగా చేరికలు**

సూర్యాపేటటౌన్, అక్టోబర్ 25 : రాష్ట్రంలోని ప్రతి వ్యక్తికి కూడా అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందించడంతో పాటు ముఖ్యమంత్రి కేసీఆర్ ముందుచూపుతో వ్యవహరించడం వల్ల నేడు దేశంలోనే తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో ముందంజలో ఉన్నదని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. నెల రోజులుగా కాంగ్రెస్, బీజేపీ నుంచి బీఆర్ఎస్‌లోకి వలసల జోరు పెరిగిందన్నారు. బుధవారం తన అనుచరులతో కలిసి ముస్లిం మైనారిటీ నాయకుడు ఇస్రార్ అహ్మద్, అలాగే 6వ వార్డు నుంచి 200 మంది మంత్రి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారందరినీ పార్టీలోకి సాదరంగా ఆహ్వానించి మంత్రి ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తెలంగాణ వ్యతిరేకులుగా ఎన్ని కుట్రలు చేసినా ప్రజలు మాత్రం బీఆర్ఎస్ వెంటే ఉన్నారన్నారు. సూర్యాపేటలో బీఆర్ఎస్ హ్యాట్రిక్ విజయాన్ని ఆపడం ఎవరి తరం కాదన్నారు. ప్రజల ఆశీస్సులే తనకు అండదండలని, వారిని కంటికి రెప్పలా కాపాడుకుంటానని తెలిపారు. విజయచక్రునాయక్, రామగిరి నగేశ్ ఆధ్వర్యంలో వివిధ పార్టీలకు చెందిన నగేశ్, సునీల్‌రెడ్డి, ధరావత్ శంకర్, ధరావత్ భూక్యా, శ్రీకాంత్, నాగు, పద్మ, ముత్యాలి, పాండు, రేణుక, వెంకన్న, కిరణ్, జోగ్య, సైదా, సైదులు, నాగు తదితరులు బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై.వెంకటేశ్వర్లు, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ గోపగాని వెంకటనారాయణ, మారిపెద్ది శ్రీనివాస్ గౌడ్, రామగిని నగేశ్, వెంపటి గురూజీ పాల్గొన్నారు.

### మంత్రికి మార్కెట్ మహిళా కార్మికుల మద్దతు..

బొడ్రాయిబజార్ : సూర్యాపేట జిల్లా అభివృద్ధికి అహర్నిశలు పాటుపడుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డి వెంటే తాముంటామని పేర్కొంటూ సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ డబ్బా, స్వీపర్ మహిళా కార్మికులు మంత్రికి మద్దతు ప్రకటించారు. ఈ మేరకు స్థానిక బీఆర్ఎస్ కార్యాలయంలో మంత్రిని కలిసి తమ సంపూర్ణ మద్దతు ప్రకటించి, పలు సమస్యలను విన్నవించారు. స్పందించిన మంత్రి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై.వెంకటేశ్వర్లు, బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు వెంపటి గురూజీ, పెద్దగట్టు చైర్మన్ కోడి సైదులు, వ్యవసాయ మార్కెట్ కార్మికుల సంఘం నాయకులు విజయమ్మ, పద్మ, భాగ్యమ్మ, ఐలమ్మ, హైమ, ఉపేందర్, శారద, శాంతమ్మ, వెంకటమ్మ, సత్తమ్మ, రమణ, ఉమా, రూప, బుజ్జెమ్మ, వజ్రమ్మ, హేమలత, నర్సమ్మ, పున్నమ్మ, చంద్రకళ, యల్లమ్మ, మమత, బొజ్జ యల్లమ్మ పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న పార్టీ శ్రేణులు